క్లుప్తంగా

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా కార్యదర్శి రమ

శింగనమల: ప్రతిఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ జిల్లా కార్యదర్శి రమ సూచించారు. సోమవారం శింగనమలలోని గ్రంథాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల్లో విజ్ఞానం పెంచుకునేందుకు అనేక పుస్తకాలున్నాయని, విద్యార్థులు, నిరుద్యోగులు, వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆమె రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కృష్ణ, పాఠకులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి మంజూరు చేయాలి



డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నేతలు

పామిడి: ప్రభుత్వం టీచర్లకు 12వ పీఆర్సీని నియమించి మధ్యంతర భృతిని తక్షణం మంజూరు చేయాలని ఏపీటీఎఫ్–257 డిమాండ్ చేసింది. స్థానిక ఎమ్మార్సీ ఆవరణలో నిర్వహించిన ఆ సంఘం డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడారు. టీచర్ల సరెండర్ లీవ్ బకాయిల విడుదలతో పాటు డీఏలను ప్రకటించాలన్నారు. అవసరమైన యాప్‌ల భారంతో పాటు బోధనేతర కార్యక్రమాలను తగ్గించాలన్నారు. అనంతరం ఆసంఘం డైరీ, క్యాలెండర్‌ను ఎంఈఓ–2 జీ సత్యనారాయణ, టీసీ హైస్కూల్ హెచ్‌ఎం కే రామ్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆసంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టీవీ రమణ, మండల గౌరవ అధ్యక్షుడు కే ఉజ్జీనప్ప, ప్రధాన కార్యదర్శి బీ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రన్నింగ్ స్టాఫ్‌పై వ్యతిరేక విధానాలను వీడాలి



మాట్లాడుతున్న ఎస్ఎం బాషా

గుంతకల్లు: రైల్వే ఉన్నతాధికారుల వ్యతిరేక విధానాల కారణంగా రన్నింగ్ స్టాఫ్ తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్లు డివిజన్ రన్నింగ్ బ్రాంచ్ సెక్రటరీ ఎస్ఎం బాషా ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో లాబీ వద్ద రన్నింగ్ స్టాఫ్ ఉద్యోగులు ధర్నాకు దిగారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక మంత్రిత్వశాఖ, రైల్వే బోర్డులు కి.మీ.కు డీఏతో సంబంధం లేదు అంటూ చెబుతూనే కి.మీ. రేట్స్ పెంపు కుదరదంటూ నిర్ణయించడం పద్ధతి కాదన్నారు. ఈ నిర్ణయంతో రన్నింగ్ సిబ్బందికి అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. రన్నింగ్ స్టాఫ్‌కు మద్దతుగా ఉండాల్సిన అధికారులు ఈ నిర్ణయాలకు సమర్థించడం ఎంత వరకు న్యాయమని ఆయన ప్రశ్నించారు. వెంటనే అధికారులు ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రన్నింగ్ స్టాఫ్ రూప్లానాయక్, జాఫర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవిస్తున్న యువకుల అరెస్టు

తాడిపత్రిటౌన్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న నలుగురు యువకులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ శివారు ప్రాంతాల్లో మద్యం సేవిస్తున్న వీరిని ఎస్ఐ గౌస్‌బాషా అదుపులోకి తీసుకున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ సాయిప్రసాద్ హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు

బుక్కరాయసముద్రం: బీకేఎస్ మేజర్ పంచాయతీలోని కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీకేఎస్ పంచాయతీతోపాటు జగనన్న లే అవుట్లలో రోడ్లు, డ్రైనేజీలు, నీటి సౌకర్యం, వీధి లైట్ల సౌకర్యం కల్పించాలన్నారు. బీకేఎస్ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శివారెడ్డి, సంజీవరెడ్డి, నాగేంద్ర, పెద్ద పుల్లయ్య, చిన్న పుల్లయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి ఏదీ?





గ్రీవెన్స్ రిజిష్టర్‌లో కేవలం ఇద్దరు అధికారులు సంతకాలు చేసిన దృశ్యం

- కొన్ని నెలలుగా గ్రీవెన్స్‌కు అధికారుల గైర్హాజరు
- ఉద్యోగుల తీరుపై ప్రజల ఆగ్రహం



అధికారులు లేక గ్రీవెన్స్ కార్యక్రమంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

గుంతకల్లు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి లేని అధికారులు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరువ్వడమే మరచిపోయారు. గుంతకల్లు మండలంలో గత కొన్ని నెలలుగా ఇదే తంతు కొనసాగుతున్నా ఉన్నతాధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో కార్యక్రమానికి రెగ్యులర్‌గా హాజరయ్యే ఒకరిద్దరు అధికారులు కూడా ఉదయం 10 గంటలకు కార్యక్రమానికి హాజరై గ్రీవెన్స్ రిజిష్టర్‌లో సంతకం చేసి తుర్రుమంటున్నారు. కార్యాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తుండటంతో దిక్కుతోచని ప్రజలు అర్జీలు ఎవరికివ్వాలో కూడా తెలియక వెనుతిరిగి వెళ్లిపోతున్నారు.

అధికారుల గైర్హాజరు..

అన్ని ప్రభుత్వ శాఖలకు ప్రత్యేకంగా కార్యాలయాలు ఉన్నప్పటికీ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు వెళ్లిన సమయంలో సంబంధిత అధికారులు కార్యాలయంలో అందుబాటులో ఉండకపోవడం, అదేమని అడిగితే విధి నిర్వహణలో భాగంగానే బయట ఉన్నామని అధికారులు తప్పించుకుంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించే క్రమంలో ప్రభుత్వం ప్రతి సోమవారం అన్ని శాఖల అధికారులను ఒకే చోట సమావేశపరచి సమస్యలపై వచ్చే ప్రజల నుంచి అర్జీలు స్వీకరించేందుకు గ్రీవెన్స్ కార్యక్రమాన్ని చేపట్టారు. దాదాపు 24 శాఖల అధికారులు గ్రీవెన్స్ కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉండగా గుంతకల్లు మండలంలో మాత్రం గత కొన్ని నెలలుగా పట్టుమని పది శాఖల అధికారులు కూడా హాజరుకావడం లేదు. హాజరైన అధికారులు కూడా వచ్చీరాగానే రిజిష్టర్‌లో సంతకం చేయడం పది నిమిషాలు కనిపించి మాయం అయిపోవడం షరామామూలుగా మారింది. దీంతో ప్రజలు సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచక అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రీవెన్స్ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

ఏమైనా రాసుకోండి



డిప్యూటీ తహసీల్దార్ నారాయణ

గ్రీవెన్స్ కార్యక్రమానికి అధికారులు వరుసగా డుమ్మా కొడుతుండటం, సోమవారం నాటి హాజరు పట్టికలో కేవలం ఇద్దరు శాఖల అధికారుల సంతకాలు మాత్రమే ఉండటంతో గ్రీవెన్స్‌లో అర్జీలను స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ నారాయణ స్వామిని 'సాక్షి' వివరణ కోరగా ఎవరి పనులు వాళ్లకుంటాయి అని ఆయన వ్యంగ్యంగా సమాధానమిచ్చారు. 'పేపర్‌లో ఏమైనా రాసుకోండి.. ఏం పరవాలేదని' ఆయన చెప్పడం గమనార్హం.

అధికారుల నిర్లక్ష్యం



గ్రీవెన్స్ కార్యక్రమంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నరు. సీపీఎం తరఫున గ్రీవెన్స్‌లో అర్జీలు ఎప్పుడు ఇవ్వడానికి వెళ్లినా అక్కడ తహసీల్దార్ మినహా ఏ ఒక్క అధికారీ కనిపించడం లేదు. అధికారుల గైర్హాజరుతో వివిధ సమస్యలపై వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– కసాపురం రమేష్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు

చిత్తశుద్ధి కొరవడింది



మండలంలో ప్రజా సమస్యలపై అధికారులకు చిత్తశుద్ధి కొరవడింది. సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలకు వెళితే అధికారులు కనిపించరు. సోమవారం గ్రీవెన్స్‌కు వెళితే అక్కడా కనిపించరు. దీంతో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా తీరును మార్చుకోవాలి..

– పీ. రాము రాయల్, సీపీఐ మండల కార్యదర్శి

పామిడిలో ఒక్కరే హాజరు..

పామిడి: స్థానిక తహసీల్దార్ కార్యాయలంలో నెలరోజులుగా నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల విభాగసం అభాసుపాలవుతోంది. అన్నిశాఖ అధికారులు గ్రీవెన్స్‌లో పాల్గొనాలన్నది ప్రభుత్వ నిబంధన. కానీప్రభుత్వ నిబంధనను ఏమాత్రం మండల కీలకశాఖాధికారులు ఖాతరు చేయడం లేదు. దీంతో ప్రతి సోమవారం అన్నిశాఖల నుంచి అధికారులెవ్వరూ హాజరుకాకుండా గ్రీవెన్స్‌ను బేఖాతరు చేస్తుండడంపై కూటమి ప్రభుత్వం అసమర్థత పాలనపై మండల ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పామిడిలో నిర్వహించే గ్రీవెన్స్‌కు క్రమం తప్పకుండా ఎంపీడీఓ తేజోత్స్న మాత్రమే హాజరవుతున్నారు. దీంతో మండలవాసులు ఇబ్బంది పడుతున్నారు. కలెక్టర్ స్పందించి గ్రీవెన్స్‌కు అన్నిశాఖల అధికారులు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

గుత్తి: పట్టణంలోని ఏపీఎస్ పీడీసీఎల్ డీఈ కార్యాలయంలో ఈ నెల 7,8, 10వ తేదీల్లో 2025–26 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, ధరలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఈ రాజశేఖర్, ఏడీఈ సాయి శంకర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్, వ్యక్తిగతంగా ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందన్నారు. గుత్తి డివిజన్ పరిధిలో రిజిస్టర్ చేసుకున్న వినియోదారులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు సర్వీస్ ప్రొవైడర్స్ గుర్తింపు మేళా

గుంతకల్లుటౌన్: రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 'ఒక కుటుంబం ఒక వ్యాపార వేత్త , వాక్ టు వర్క్' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని సర్వీస్ ప్రొవైడర్స్ గుర్తింపు కోసం ఈ నెల 8న మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మేళా నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మెప్మా కార్యాలయంలో ఇదివరకే పేర్లు నమోదు చేసుకుని మేళాకు హాజరయ్యే సర్వీస్ ప్రొవైడర్లు ఆధార్, డ్రైవింగ్ లైసెన్సు, పాన్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, టెక్నికల్ కోర్సుల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో తీసుకురావాలన్నారు.

పప్పుశనగ రైతులను ఆదుకోవాలి



తెగుళ్ల కారణంగా దెబ్బతిన్న పప్పుశనగ పంటను చూపుతున్న శనగలగూడూరు రైతులు

పుట్లూరు: తెగుళ్ల కారణంగా రబీలో సాగు చేసిన పప్పుశనగ దెబ్బతిని, పెట్టుబడులు చేతికందని దుస్థితి ఏర్పడినట్లు శనగలగూడూరు రైతులు వాపోయారు. సోమవారం శింగనమల నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరైన శనగలగూడూరు రైతులు తమ సమస్యలను అధికారులకు వివరించారు. రైతులకు నష్ట పరిహారం, బీమా అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్‌కు రైతులు వినతి పత్రం అందించారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని జూనియర్ కళాశాల క్రీడాప్రాంగణంలో సోమవారం క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ప్రారంభించారు. తాడిపత్రి నియోజకవర్గంలోని మండలాల నుంచి దాదాపు 50 జట్లు టోర్నమెంట్‌లో పాల్గొననున్నాయి. దాదాపు 8 రోజుల పాటు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కురుబలను ఎస్సీ జాబితా నుంచి తొలగించాలి

గుంతకల్లు రూరల్: కుల గణన సర్వేలో భాగంగా కొన్ని సచివాలయాల పరిధిలో కురుబలను ఎస్సీ జాబితాలో చేర్చారని, వారిని వెంటనే తొలగించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రాష్ట్ర కో కన్వీనర్ వై.భీమలింగ మాట్లాడుతూ కుల గణన సర్వేలో కొన్ని తప్పిదాలు జరిగాయన్నారు. మాదిగలను క్రిష్టియన్లుగా, కురుబలను ఎస్సీ జాబితాలో చేర్చారన్నారు. ఎస్సీ వర్గీకరణ లేకపోవడం వల్ల మాదిగలు ఇప్పటికే చాలా వెనకబడ్డారన్నారు.ఇప్పుడు మళ్లీ ఆర్థికంగా ఎదిగిన కురుబలను తీసుకువచ్చి ఎస్సీ జాబితాలో చేరిస్తే ఎస్సీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. వెంటనే కురుబలను ఎస్సీ జాబితా నుండి తొలగించాలని వారు డిమాండ్ చేశారు.

సంక్షిప్త సమాచారం

9న మండల సమావేశం

పెద్దవడుగూరు: మండల సర్వ సభ్య సమావేశం ఈ నెల 9న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహారెడ్డి సోమవారం తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు ఉదయం 11 గంటలకు సమావేశానికి హాజరు కావాలన్నారు. వ్యవసాయం, పశుపోషణ, వెలుగు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్యం, తాగునీరు, రెవెన్యూ, గృహ నిర్మాణం, విద్యుశ్చక్తి, ప్రాథమిక విద్య, ఉపాధి హామీ, పంచాయతీరాజ్, పండ్ల తోటలు, గ్రామ పంచాయితీల అభివృద్ధి అటవీశాఖ, ఆర్టీసీ, రోడ్లు, భవనాలు, పట్టు పరిశ్రమ, మైనర్ ఇరిగేషన్, చేపల ఉత్పత్తి శాఖల అధికారులు పాల్గొనాలని ఆయన సూచించారు.

రేపు ద్విచక్ర వాహనాల వేలం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు మూడు ద్విచక్ర వాహనాలకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ నాగ సునీత సోమవారం తెలిపారు. మద్యం కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను వేలం వేస్తామని, ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలన్నారు.

పోలీసుల అదుపులో కేబుల్ దొంగలు

తాడిపత్రిటౌన్: పట్టణ పోలీసులు ఇద్దరు కేబుల్ దొంగలను అరెస్ట్ చేశారు. వివరాలు.. పెన్నానదిలో మున్సిపాలిటీ నీటి బోర్లకు సంబంధించిన కేబుల్‌ను ఇద్దరు దొంగలు సోమవారం దొంగిలించి పెన్నానది ఒడ్డున జేసీ పార్క్ సమీపంలో కాపర్ వైర్‌ను తీసుకునేందుకు కేబుల్‌ను కాలుస్తుండగా.. అక్కడే విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది వారి పోలీసులకు అప్పగించారు. వారిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

తాడిపత్రి రూరల్: మండలంలోని సీబీఆర్ కళాశాల వద్ద సోమవారం మోటర్ సైకిల్‌పై వెళుతున్న నరసింహులును ప్రైవేట్ బస్సు ఢీ కొట్టడంతో గాయపడ్డాడు. వివరాలు. . పెద్దపప్పూరు మండలం సోమనపల్లి గ్రామానికి చెందిన ఆయన తాడిపత్రి నుంచి స్వగ్రామానికి వెళుతుండగా బస్సు ఢీకొంది. గాయపడిన అతడిని తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. ఘటనకు సంబంధించి బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు.

సాగుభూమి పంపిణీ చేయాలి

పెద్దవడుగూరు: మండలంలోని భూమిలేని నిరుపేదలకు సాగుభూమి పంపిణీ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కత్తుల కొండయ్య కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంతో తహసీల్దార్ ఉషారాణిని కలసి దిమ్మగుడి, కండ్లగూడూరు, పెద్దవడుగూరు గ్రామాల్లోని భూమి లేని రైతులకు పట్టాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిథిలావస్థలో హాస్టల్ భవనాలు..

గుంతకల్లు: హాస్టల్ భవనాలు పెచ్చులూడి శిథిలావస్థకు చేరడంతో, ఏ సమయంలో ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వినోద్, వెంకటనాయక్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని పాతకొత్త చెరువు బీసీ బాలుర హాస్టల్, గుత్తిలోని కోట హాస్టల్ భవనాలు నిర్మించి దాదాపు 45 ఏళ్లు పూర్తి కావడంతో శిథిలాస్థుకు చేరాయన్నారు. దీంతో హాస్టల్ పైకప్పులు పెచ్చులూడి కిందకు పడుతుండంతో విద్యార్థులు రాత్రి పూట నిద్ర చేయడానికి భయపడుతున్నారు హాస్టల్స్‌ను నూతన భవనాల్లోకి మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రోహిత్, శివమణి, సమీర్, జయరాం, ముత్యానంద. భాస్కర్, సూరి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా ..తడిచిన బియ్యం బస్తాలు

పెద్దపప్పూరు: మండలంలోని కొత్తపెండేకల్లు గ్రామ సమీపంలోని రైల్వే వంతెన కింద బియ్యం బస్తాల లోడుతో సుంకేసులపల్లి గ్రామానికి వస్తున్న ట్రాక్టర్ బోల్తాపడింది. డ్రైవర్ అప్రమత్తంగా ఉండి బయటకు దూకాడు. ట్రాక్టర్ బోల్తాపడటంతో ట్రాలీలోని దాదాపు 80 బియ్యం బస్తాలు నీటిలో పడి రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లింది. తడిచిన బియ్యం బస్తాలు ఉపయోగపడవని, ఆదుకోవాలని సమీపంలోని రైల్వే స్టేషన్ మాస్టర్‌కు బాధితులు వినతి పత్రం అందజేశారు.

కోటంక, మర్తాడు చెరువులకు నీరివ్వాలి



ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

గార్లదిన్నె: గార్లదిన్నె మండలంలోని కోటంక, మర్తాడు చెరువులకు వెంటనే నీరివ్వాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం అనంతపురంలోని చిన్న నీటిపారుదల శాఖ కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. చెరువులకు నీరు వచ్చేందుకు తవ్విన కాలువను ఓ వ్యక్తి అక్రమంగా పూడ్చడంతో నీరు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. 2008లో రూ.కోటి వ్యయంతో కాలవ తవ్వారన్నారు. చెరువును లోకలైజేషన్ కూడా చేశారన్నారు. చెరువును నింపడం ద్వారా కోటంక, తాటిచెర్ల, మర్తాడు తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని తెలిపారు. వేలాది ఎకరాల్లో చీనీ పంటల సాగుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వెంటనే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. గురువారం నుంచి నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్ఈ విశ్వనాథరెడ్డి హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రామిరెడ్డి, సహాయ కార్యదర్శి బీహెచ్ రాయుడు, రైతులు నారాయణ రెడ్డి, నాగార్జున రెడ్డి, రవి, ప్రతాప్‌రెడ్డి, రవితేజ, వెంకట్రామి రెడ్డి, పరమేష్, సుధాకర్, రామలింగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కిశోర వికాసం'తో బంగారు భవిష్యత్

గార్లదిన్నె/పుట్లూరు: కిశోర వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ అన్నారు. సోమవారం గార్లదిన్నెలో రైతు సేవా కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాసంపై అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది, హెచ్‌ఎంలు, మండల స్థాయి అధికారులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ బాలికలు చదువుపై దృష్టి పెట్టేలా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు.18 ఏళ్ల నిండకుండా బాలికలకు వివాహం చేయరాదన్నారు. సీడీపీఓ ఉమాశంకరమ్మ, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఐసీడీఎస్ సూపర్ వైజర్స్ వాణిశ్రీ, జ్యోతి, అధికారులు పాల్గొన్నారు. అలాగే పుట్లూరు మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బందికి కిశోర వికాసం కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ నార్పల డివిజన్ సీడీపీఓ భారతి, ఎంఈఓ శ్రీదేవి, సూపర్‌వైజర్ శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని సీఐటీయూ కాలనీలకి చెందిన బి.మమత అనే యువతి సోమవారం విష రసాయనం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబసభ్యులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉందని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

రైల్వే అధికారులు సహకరించాలి

గుత్తి: గుత్తి కోటను సంరక్షించడానికి రైల్వే అధికారులు సహకరించాలని గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్ కోరారు. గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వే డీజిల్‌షెడ్‌లో సోమవారం గుత్తి కోట సంరక్షణ సమితి నూతన సంవత్సరం 2025 క్యాలెండర్లను సీనియర్ డీఎంఈ , రైల్వే అధికారులు చేతుల మీదగా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి సహకరించడంతో పాటు గౌతమేశ్వరాలయానికి అండర్ వే బ్రిడ్జిని నిర్మించాలని, గుత్తిలోని ఎంఎస్ హైస్కూల్ వద్ద ప్రొటెక్షన్ వాల్ నిర్మించాలని కోరారు. అందుకు రైల్వే సీనియర్ డీఎంఈ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి గౌరవాధ్యక్షులు వెంకటరామిరెడ్డి, గౌరవ సలహాదారులు సూర్యనారాయణ రెడ్డి, బాబా సాహెబ్, గైడ్ రమేష్, జ్ఞానశేఖర్, సుధాకర్ నాయుడు, జిలాన్, కాశేశ్వరరావు, విక్రమ్ పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన చీటీల బాధితులు



పోలీసు స్టేషన్ ఎదుట బాధితులు

గుత్తి: చీటీల బాధితులు సోమవారం మరోసారి పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. వివరాలు.. గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ఎస్‌పల్లికి చెందిన అంజలీదేవి, పురుషోత్తం దంపతులు చీటీలు, వడ్డీల పేరుతో సుమారు రూ. 3 కోట్లు వసూలు చేసుకుని నెల క్రితం ఉడాయించారు. గత శనివారం అంజలీదేవి తల్లి ఇంట్లో సామాన్లు తీసుకెళుతుండగా బాధితులు అడ్డుపడి పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. అయితే పోలీసులు మరోసారి ఫిర్యాదు చేయాలని చెప్పారు. ఈ క్రమంలో రెండో సారి బాధితులు కంబగిరి, ఎర్రిస్వామి, భరత్, హరిప్రసాద్, ఉమా మహేశ్వరి, లక్ష్మిదేవి, తులసమ్మ తదితర సుమారు 150 మంది పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. ఎస్ఐ సురేష్ అంజలి దేవికి ఫోన్ చేసి పోలీసు స్టేషన్‌కు రమ్మన్నారు. ఆమె వస్తానని చెప్పింది. దీంతో ఎస్ఐ సూచన మేరకు బాధితులందరూ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేచి ఉన్నా అంజలీదేవి రాలేదు. దీంతో సీఐ వెంకటేశ్వర్లు స్పందించి కానిస్టేబుళ్ల ద్వారా అంజలి దేవికి ఫోన్ చేయించగా ఆమె అందుబాటులోకి రాలేదు. ఆమె వచ్చాక మీకు సమాచారం ఇస్తామని అపుడు రావాలని బాధితులకు సీఐ చెప్పడంతో అందరూ వెళ్లిపోయారు. కాగా అంజలీదేవి టోకరా మూడు కోట్లను దాటే అవకాశమున్నట్లు బాధితులు చెప్పారు. మొత్తం 150 మంది బాధితులు తేలారు. ఇప్పటిదాకా 110 బాధితుల లిస్టు తయారు చేశారు. ఇప్పటికే రూ. 2 కోట్ల 70 లక్షలు దాటింది. ఇంకా 40 మంది బాధితుల వివరాలు తెలియాల్సి ఉంది.

తాడిపత్రి ఓటర్లు 2,44,279 మంది

తాడిపత్రి రూరల్: తాడిపత్రి నియోజకవర్గంలో 2,44,279 మంది ఓటర్లు ఉన్నారని రెవెన్యూ అధికారులు తెలిపారు. సోమవారం నూతన ఓటరు జాబితా విడుదల చేశారు. గతంతో పోలిస్తే అదనంగా 5,063 మంది ఓటర్లు పెరిగారు. తాడిపత్రి పట్టణ, మండలంలో అదనంగా 2,951మంది ఓటర్లు, పెద్దపప్పూరు మండలంలో 442 మంది, పెద్దవడుగూరులో 621 మంది, యాడికిలో 1,049 మంది ఓటర్లు పెరిగారు. ప్రస్తుతం తాడిపత్రి పట్టణ, మండలంలో పురుషులు 65,866 మంది, స్త్రీలు 68,011 మంది, ట్రాన్స్‌జెండర్లు17 మంది ఉన్నారు. పెద్దపప్పూరు మండలంలో పురుషులు 14,065 మంది, స్త్రీలు 13,566 మంది, ట్రాన్స్‌జెండర్లు ఇద్దరున్నారు. పెద్దవడుగూరు మండలంలో పురుషులు 18,308, స్త్రీలు 18,012 మంది, ఒక ట్రాన్స్ జెండర్ ఉన్నారు. యాడికి మండలంలో పురుషులు 23,345 మంది, స్త్రీలు 23,081మంది, ట్రాన్స్‌జెండర్లు ఐదుగురున్నారు.

మట్కా నిర్వాహకుడి అరెస్ట్

తాడిపత్రిటౌన్: పట్టణంలోని గాంధీకట్ట సమీపంలో మట్కా నిర్వహిస్తున్న రజాక్‌ను సోమవారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో నిందితుడి ఇంట్లో సోదాలు నిర్వహించి రూ.70 వేల నగదు, మట్కా చీటీలు స్వాధీనం చేసుకున్నామని సీఐ సాయి ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ గౌస్‌భాషా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.